# సొమ్ము - సొమందం

సొమ్మొ, సొమందం అనంగనె మొకం వాసి మురిపెం జూపని ఆడిపుట్టుక వుంటాది ? అంటె వుండదు ; అన్న మాట యిని మీరంత ఏందొ ? ఎక్కడలేని యిచిత్రాలు వ్రాసినట్ల కండ్లన్ని దెర్శి, బొమగంటు వెట్టి సూడకుండి.' అందరాని చెట్టుపండు చేదు ' అన్నట్ల మనతాన లేక అంత సేదే ! లేకుంటేంది ?

ఈనాడు కమ్మగ పుల్లగంట బుక్కెడు బువ్వకె మిడుక్క సస్తుంటె ఇంగ తొలం వూసానికి అంగలార్సేదెవరు ? సొమ్ములూ గిమ్ములు కొనుక్కోనికె యాడ దేవుల్లాడ్తరు గని ?

'కోరినంత వెట్టెనమ్మ కోతిశివుడు ' అంట ఈనాడు ఆడోండ్లు ముద్దుగ మొగడు కష్టమో నిష్టురమో జేసి తెచ్చింది వండిపెట్టి తిని నీడపట్టున వుండక సొసంత్రం, సొసంత్రం అంట మొగోని తొటి సరి బరి పోటికి దిగితె, వాడేం తక్కువ దిన్నాడు బిడ్డ ? ఇంటిపని బయిటిపని రొండు ఆడిదాని నెత్తిన రుద్ది టింగురంగున దిర్గుతుండడు.

ఇన్నాళ్లు ఆడివిల్ల ఇంట్లవుండి కల్గిందాంట్ల కొగంజో కాస్కోని అటెంక తీర్వా టంగ నున్నగ నూనె మెరుగు వెట్టి , దువ్వి, శిగెముడ్సి, పూలువెట్టుకోని, కాళ్లకు, సేతులకు, ముక్కుకు తప్పకుండ యాదన్న వొ వస్తువ వెట్టుకోని సింగారిచ్చు కుంటుండె. ఇప్పుడదంత యాండది?

ఇప్పుడెవరన్న సొమ్ములు వెట్టుకోని కండ్లవడ్తె ' ఇదేం ఏశం ఏశకాంతోలె ' అంటరు. అమ్మో ! ముందే మొగోణి సూపు పాపిష్టిసూపు, అందుట్ల ఆడిదాని శిగెల పూలవాసన గొట్టిందంటె ? ఆ గాలి ముక్కుపుటాలకెల్లివోయి వాణి మాడన దాగిన కోతిపురుగును కదిలిస్తది; ఇంగ ఆపురుగు ఈరమార వోయి ఆపూలు వెట్టుకున్న తల్లి నడ్తకు బందమై అడ్డం దగుల్తది.

ఇది పసిగట్టిన ఆడివిల్ల పాపం సదువుకు వోయినగని, కచ్చీర్లల్ల పనికి వోయినగని

పూలు గీలు వెట్కపోదు.

ఆట్ల గాకుండ ఎవరన్న బాగదైర్నం గల్ల ఆడివిల్ల తెగువతోటి అఁ వాడెంత ? వాణి సూపులెంత ? నాకు దిగదుడ్పు అంట సోమ్ము గిమ్ము ముద్దుగ సింగారం జేస్క పోద మంటె తోవపోంటి బస్సులు ఎక్కదిగ దొంగనొ? దొరనొ? అంట బుగులు ; ఇన్ని తిప్పలు వడుడెందుకు ? అంట అనుకోని 'అందని అంగూరాలు పుల్లన ' అన్న సామెతోలె బింకం జెడకుండంగ-

'అఁ ఏంసొమ్ము ? సదువుకోని మూర్ఖత్వం, సొగుసు సొమ్ముల తోటెవొస్తాది ? అట్ల మొకాన్ని మెరుగులు వెట్టి మెరిపియ్యాల్నంటె బజార్లఎన్నిపూతల్లేవు ? తీరొక్క రంగు, కంటికి, పంటికి, వొంటికి, చెంపలకు సేతులకు అంట ఏందొ ? కొత్త నాజూకులు నేర్పుతరు. ఇప్పటికి ఆడివిల్లల ముచ్చెట్లు ఇంటుంటె నాకో సామెత యాది కొస్తది. 'ఎన్కటికి అయ్యగారి సంపాదన అమ్మగారి పసుపుకుంకుమల కిందికి సరిపాయె ' అన్నరు గని ఇప్పుడు అమ్మగారి సంపాదన అమ్మగారి ఎన్నపోడరు, పాడిపోడరు కింద జమాయె అన్నట్ల ' అయితది. ఇదంత తతంగం ఉండదిగన్కనె పాపం ఇప్పటోండ్లు యాడి కొచ్చినగని 'బోసిముంతలోలె' ఉత్కి ఆరేసిన బట్టలోలె వొచ్చుడు అలువాటైంది.

సొమ్ముల సంగతి మీకేం ఎర్కనె బుర్కసిట్టలు ? ఎన్కట మీతీర్గ ఆడోండ్లకు ఆస్తిల, పాళ్లు పంపులు యాండవి? సొతాగ సంపాదన మాటెక్కడిది ? అందుకని తల్లిదండ్రి, అత్తమామలు, చెడని పదార్ధం అంట సొమ్ముల రూపుకంగ పిల్లపైమీద వెడ్తుండిరి, ఆసొమ్మే ఆడిదానికి అలంకారం, లేన్నాడు ఆ దెరువు.

మీకు ఎర్కెగద ? కవితల్లైటోండ్లు గుడ తమ కవిత్వానికి సొగుసులు దీర్చె నేర్పులను, విన్నాణాలను అలంకారాలంట విలుస్తరని?

అంతెందుకు రామాయిణంల సీతమ్మకు ఆయింత నగులుండ వట్టెగద ? రావణాసురుడు ఎత్తుకపోంగ సొమ్ముల ముల్లెను దీసి పారేసింది! ఆ అలంకారాల వట్టే సీతమ్మవారి ఆనవాలు రాముల వారికి దొరికింది. ఆ సొమ్మేలేకుంటె ఎట్లుండు ? అట్లనె ఆంజనేలు లంకల సీతమ్మ వారిని జూసిన గుర్తుగ శికెన వెట్టుకునె చూడామణి యిచ్చితోలింది. రామయ్య ముద్దుటుంగరాన్ని దీసుకున్నది. ఈ నగలే లేకుంటె ఆంజనేలు ఏం జేసు ? కలిమిడి ఎట్లైతుండె ?

ఇసొంటి ఆనవాళ్లే పేదరాశిపెద్దమ్మకతలల్ల గుడకండ్లవడ్తవి.

పెండ్లాం పైనిండ సొమ్ము వెట్టుకుంటె మొగణికి ఆయుష్షు పెరుగు తదని ఉన్న సొమ్మంత పైనిండ దిగేస్కోని పూసిన తంగెళ్లోలె కండ్లవండ్తుండిరి.

ఎంత ఆ పూటకు లేని సంసారమైనగని మెళ్లపుస్తెవొట్టు, నల్లపూసలజతకు రొండు పచ్చపూసలన్నవుంటవి. ఇంగకల్గి నోళ్ల ముచ్చట జెప్పవశమా ?

ఒక్కొక్కఇంట్ల ఒక్కొక్కతీరు సొమ్ము. ఇంగ ఆ పేర్లన్ని జెప్పాల్నంటె వో సిన్న పాటి పుస్తకం రాయొచ్చు. అంట నేను అనంగనె

అమ్మమ్మ ! పిలీజ్, మాకు మీకాలం నాటి నగల పేర్లు జెప్పవా ? అమ్మమ్మా ! ఆ చొమ్మలు నాకు చేపియ్యే ! అంట నామనమ్మరాండ్లు వోకాకికతనో ? పిట్టకతనో జెప్పు అన్నంత ఇదిగ నాసుట్టు జేరి లొల్లి లొల్లి జేయవట్టిన్రు. ఇంతట్లకె మా యారాలి మన్మ రాండ్లు, నామర్దిపిల్లలు అంత సుట్టురా జేరి ముచ్చెటేందొ ? దెల్వకుండనె, అమ్మమ్మ ! బెద్దమ్మ ! నానమ్మ ! చెప్పవా? కత అంట మొదలు వెట్టిన్రు.

అంతే గాదు ఎన్కటికి, ఎంటికెకంటికకు వో బంగారు మొగ్గగూర్చిన పేదరాశి పెద్దమ్మ కత యిన సెవులు నిక్కపొడ్సుకున్నట్ల గూసుండి, నాగద్వ వట్టుకోని నా వొడిల నెత్తివెట్టి వొగలు వోకుంట, నకురాలు వడవట్టిన్రు.

అందుట్ల అందరికన్న' సిన్నసిత్లాకులు' ఇద్దరేమొ నాకు ముద్దులిచ్చుకుంట అమ్మ మ్మ ! మాకు చొమ్మలు చెప్పవా? నీకు దినాం ఇన్నిన్ని ముద్దులిత్తం, కాళ్ళొత్తుతం, సురచ్చినాలు దెచ్చిస్తం, సూదిల దారం బెట్టిస్తం. అంట ఎంటవడ్డరు.

అప్పుడు నేను సంబురపు జల్లులల్ల తడ్సుకుంట 'ఇంగ మీరు నాకు కుశామత్ జేసుడు, మాని, దొంగతంతులు ఇడ్సి ముద్దుగ గూసోండి చెప్తగని అన్న -

'అమ్మమ్మ ! ముక్కుమీద ఏలోచోని, సకిలం ముకిలం బెట్టుక కూసుంటం' అంట అంటుండంగనె లోపటికెళ్లి రఁయిమంట, నా పెద్ద మన్మరాలు, సరస, నా తమ్ముని బిడ్డ ఎన్నెల ఏందొ ? పరిశోదన జేస్తుండరంట,వూట కలం, కాయితాలు కొండొచ్చి, నాపక్కన జేరిన్రు. ఇందాకే నన్ను జుట్టుకున్న సిన్న పోరల సేతులల్ల తలా వోపిప్పరమెంటు వెట్టి ఎలగొట్టిన్రు.

మరీసిన్నోళ్లు మట్టుకు నన్నిడ్వకుండ మరింత గట్టిగ నన్నల్లుకోని 'అమ్మో ! అమ్మమ్మ నాయి, మేం చొమ్ములకత యింటం పోం' అంట గూసున్నరు.

'అయితె మాయె మీరు నాబంగారు బొమ్మలు, మీకేజెప్త ముచ్చెట, అక్కలకు కాదు ' అంట బుజ్జగిచ్చి మొదలు వెట్టిన.

'అమ్మలూ ! నగలన్నా, సీరలన్నా ముచ్చెట వడని ఆడిపుట్టుక ఒక్కమన దేశంలనె గాదు భూప్రపంచికంల వున్న సబ్బండ దేశాలల్ల గుడ కరువే! అందుకె ఎన్కటి నుండి నగలకూ నాణాలకు యిలువ ఎక్కువ.

ఇంతకు ఎవరన్నగని బంగారాన్ని ముద్దలకు ముద్దలు సింతపండోలె, బెల్లపు ముద్దలోలె, సీకులోలె, కడ్డీలోలె, వెట్టుకోరు, దాన్ని నానా రూపుకంల సొమ్ము జేపిచ్చి ఆడోండ్ల మీదవెడ్తరు, అక్కర వడ్డప్పుడు వొల్సుకునుడు అల్కన అంట.

ఇంగ మన ఎడ్డితల్లులు, ముర్సిపోయి కాళ్లకు, నడ్మలకు, సేతులకు, శిగెలకు, సెవులకు తూట్లు గుడపొడిపిచ్చుకోని, ఆయానగలను తగిలిచ్చుకోని నిధులను కాపాడుతున్న నాగమణులోలె, గల్లు గల్లున తిర్గుకుంట ఇంటెడు శాకిరి జేస్తరు.

ఇట్ల సొమ్ముల తోటి, సోకుల తోటి ఆడి దాన్ని గట్టేసి, మొగోడు ఉపాయంగ అన్నిట్ల ఆడివిల్ల కన్నతానే బెత్తెడు పొడుగంట రుజావు జేసుకున్నడు. ఎరేసి శాపను గుంజె తంతు అంటె గిదేనేమొ?

'హియర్ ! హియర్ ! అమ్మమ్మ ! మోస్టు రిబెలియస్ ఫెమినిస్టు తీర్గ మాట్లాడు తుండవు. నిజంగ నీవే నా? యీ మాటలంటున్నది ? అంట అడిగిన్రు ఎడవిల్లలు . 'అమ్మమ్మ ! చొమ్ముల కతచెప్పు. గీ బెద్దమాటలొద్దు ' అంట తలో దిక్కు పీకిన్రు.

అయితె ఇనుండి, మన తెలంగాణ పోండ్ల సొమ్ములు జెప్త ; ఏంది ? సొమ్ములల్ల గుడ తెలంగాణపు సొమ్ములంట ఏరుంటాయి ? అంట అడ్గుతుండారు ? ఎందు కుండవ్ ? మొత్తం మాట్లాడె బాసవొక్కటైనా? ఒక్కొక్క సోట పలుకువడిల యాసల ఏరైనట్లె నగలల్ల గుడ తీరు తీరు నమొనాలు గండ్ల వడ్తవి.

అమ్మొ ! పోరగాండ్లు నిద్ర కొచ్చినారు ? అయితె అందుకోండి అంట అందిచ్చిన. ఇంగపురుసతుగ యినుండి; మనపుస్తుకాలల్ల ఎన్కటికి పెద్దపెద్ద పేరు వోయిన రాణమ్మ

లు అంటె ద్రౌపదమ్మ, సుబద్రమ్మ, సత్తెబామమ్మలకు ఏడువారాలసొమ్ములుండేవంట. అమ్మో ! అవన్ని మనం ఎన్నడు కండ్ల జూడని మణులు, మాణిక్యాలు, వజ్రాలు, పుష్య రాగాలు, ఆణిముత్యాలు, కెంపులు, వైడూర్యాలెనంట. ఇంగ వాండ్లకు బంగారం వో లెక్క లోనిది కానేకాదు. వెలకు మిక్కుటమైన ఈ వజ్రమాణిక్యాలను పొదిగి ఉంచెటందుకు లక్కోలె బంగారం వాడుకునె టోండ్లంట.

ఈసొమ్ములల్ల యావారం ఏగ్రహానికి మంచిదో అంట, ఇంటి పురోహితయ్య జెప్పంగ ఆదినం ఆవర్ణపుసొమ్ము సింగారిచ్చుకునెటోండ్లు. పెట్టిపుట్టిన జన్మలాయె. మన తీర్గన ? సింతాకంత బంగారు ముక్కుపుల్ల పిసరుకు గీమాలి గీమాలి సావాలె. అయింత ఆమాట అత్త సెవుల వడ్తె సీపురుకట్ట తోటి సింగారిస్తది.

నడుంగుల మా కాలపుముచ్చెటెందుకు ? గని ఇనుండి.

ఇంగ అచ్చం బంగారాన్ని ఇంట్ల తలెలకు, చెంబులకు, టూగుటుయ్యాల గొల్సులకు, మంచం కోళ్లకు, అద్దం పిడీలకు, కత్తులు, కటార్ల పిడీలకు వాడ్తుండిరంట. ఇంగ ఇట్లనె దేవస్థానంల శికిరాలకు దేవుండ్ల అబిషేకపు బిందెలకు, తలుపులకు, పాంకోళ్లకు, ఆరగింపు తబుకులు, స్తాళీలకు, ఛెత్రీలకు, చామరాలకు వాడెటోండ్లంట. ఇంగబంగారు సొవుమ్మలేవెు రాణులు వాండ్ల ఖాసుసెలికత్తెలకు, దాసీలకుగిన ఇచ్చెటోండ్లంట.

అంతెందుకు ? మొన్న మొన్నటి దాంక అల్లుణికి పెండ్లినాడు ఇచ్చెఎండితలె నడుంగల వోపావులెత్తు బంగారు పువ్వు అతికిచ్చి ఇచ్చుడు రివాజుగ వుండేది.

ఇదంత సాధారణపు ముచ్చెట గని, ఇంగ ఫక్తు తెలంగాణపు పల్లెజనం అంటె ప్రత్యే కంగ ఆడోండ్లు వెట్టుకునె సొమ్ములు ఇనుండి. తొల్త అన్నిటికన్న నెత్తి ముఖ్యం గన్క ఆడి కెల్లి మొదలు వెడ్త.

**నెత్తిసామాను:-** మొకానికి ఎదూరు గపాపెట్ల పాపెటసేరు, అవుతల ఇవుతల రాళ్లు వొదిగిన పట్టీ, దానిమీదంగ సూర్య చెంద్రులు ఇంగ నడినెత్తిన రాకిణి, చంద్రవంక, జడ బంగారు, కొనాకు జడకుచ్చులు. వీటినె జడగంటలు అంటరు. ఇవి పెద్దదొర్సాన్ల సొమ్ములు, పెండ్లికో ప్రవోజినానికొ వెట్టుకుంటరు.

ఇవిటినె అంటె అసలువిగాకుండగిలేట్‌వి 'భాగోతం' గట్టినప్పుడు భామ ఏశం

బెట్టుకుంటది.

**ఇంగిమనసింటో ండ్లం బెట్టుకునేవి:-** రాకిడి, నాగురం, రాళ్ల శిగబిల్ల, కాజిగె, పిం పిణి, చామంతిపువ్వు, సౌరకుప్పె, జడపూలు, జడగొండెలు,

**కొప్పుసామాను :-** కొప్పు మొగ్గలు, కొప్పుచిల్కలు, కొప్పుబిళ్ల, ముత్యాల మొగ్గ లు, పగుడాలమొగ్గలు, గజ్జెలపిన్ను, కొప్పుగొల్సులు, శికబిళ్ల, బాగకలిగినోళ్లకు తలచిక్కు (అదిప్పుడు ఎక్కడ లేదు) పాపెటసేరు, దంతపు పిన్నులు, డాంకురేకు తళుక్కుబిళ్లలు.

**చెవులసామాను:-** బుగిడీలు, బావులీలు, కత్తెర బావులీలు, అద్దాలబావులీలు, తణుకులు, గెంటీలు, గున్నాలగెంటీలు, తుమ్మపువ్వుకమ్మలు, రాళ్లకమ్మలు, కుందనపు కమ్మలు, జంపులు, జంపుగెంటీలు, కిలావర్లు, వొంటిరాయికమ్మ, గొల్కులు బొగడలు, గువ్వపోగులు, జుంకాలు, లోలాకులు, లట్కులు, ముత్యాలలోలాకులు, గుత్తులు, కాసెపూసె పండ్లు, సర్పిణీలు, మాటీలు, బంగారు చెవులు, తిన్కాలు, చెక్కుడు గొల్సులు, రింగులు, కర్ణపూలు, తీరొక్కరూపుకంల తీరొక్కనమోన.

**ముక్కుసామాను:-** ముక్కుపుల్ల, వుత్తబంగారుది, ఏడురాళ్ల బేసరి, అయిదు రాళ్లది, మూడురాళ్లది, వొంటిరాయిది. నత్తు, ముత్యాలనత్తు, హంసనత్తు, మొక్కెర, ముక్కుపోగు బులాకి. రొండు ముక్కుల కూ నగవుంది.

**మెడిసొమ్ము :-** తీగె, కంటె, రాళ్లకంటె, ముత్యాలకంటె, చెక్కణపు కంటె, గుండ్లకంటె, అసిలి, అడ్కులు, పట్టెడ, రాళ్లపట్టెడ, టిక్కి, గుండ్లటిక్కి, నాను, గోదుమాణి, అడ్డిగ, వొంటిగజ్జె, గుండ్లపేరు, గొల్లినాను, తాయెత్తులదండ, దండతా యెత్తులు, యాకళ్లసరం, పచ్చులపేరు, పుస్తెలసామాను, పల్కులగుండ్లు, పులిగోరుదండ, లవంగాలపేరు, మామిడిపిందెలగొల్సు, తావళం, గుండ్లతుస్సె, తుస్సె, గట్టిగొల్సు, గోవ ర్ధనం ముడి, మొగ్గలదండ, కాసులపేరు, గోపుతాడు, నక్షత్రమాల, సూర్యహారం, చంద్రహారం, అష్రఫీలదండ, బన్నసరం, పగడాల పట్టెడ, మిరియాలదండ, జతగుండ్లు, చిల్కల పేరు, నవరత్నాలహారం, మణులపేరు, నానుపత్కం, నల్లపూసల దండ, జోమాల, వొంటి గజ్జె, నల్లపూసలపేరు, సౌకులదండు, ఎనలదండ, గొట్టాలదండ.

**చేతలకు :-** దండకడాలు, వొంకు, ఒడ్డెవొంకు, గజ్జెలవొంకు, దండపట్టి, చెక్కణపుపట్టి, దండపురులు, సందెకడెం, గాజులు , గిరిగాజులు, కంకణాలు,

బోలుకడాలు, వొత్తులు, పోంచీలు, సింహం మూతికడాలు, కాకరకాయగొల్సులు, వొడిగొల్సులు, చాకట్లు, యాపకాయె కడాలు, పాట్నీలు, పులిచేరు కడియాలు, పాదుగులు, రవ్వలగాజులు,, కెంపులుకంకణాలు,పచ్చల గాజులు, ముత్యాల కంకణాలు, పగడాల కంకణాలు.గజ్జెలపట్టి, రాళ్లపట్టి, తీరొక్కరకాలు.

**ఏళ్లకు ఉంగురాలు :-** బొట్టనేలు దప్పిచ్చి అన్ని ఏళ్లకు అన్ని తీర్లవి పెట్టు కుంటరు,శనాఖరీదైన రాళ్లుపొదిగిచ్చి చేపిచ్చిన బటువులువుంటవి,. వొంకివుంగరం ప్రధానపు వుంగరం, చిక్కులవుంగరం, చిక్కులవుంగరం అయిదారు సన్నటి ఉంగు రాలను ఒక దిక్కుమట్కె జోడి స్తరు, ఇవన్ని గల్సి వోపువ్వు తీర్గనా, ముగ్గుతీర్గనా ఏర్పడ్తవి. ఒక్కొక్క రింగుకు మీది దిక్కున బంగారం అత్కివుంటది, అన్నిజోడిస్తె ఆ బంగారు మూతులన్ని కల్సి వో ఆకారాన్ని ఇస్తవి. తీసిదులిపితే వుత్త ఎండిరింగు కండ్ల వడ్తది ఈ పనితనం ఇప్పుడు లేదు.

**నడ్ములకు :-** డావు, వొడ్డాణం, మొలకట్లు, బిల్లల డావు, చెక్కణపు మొలకట్లు, గజ్జెలమొలకట్లు, గంటల మొలనూలు, గొలుసుల మొలనూళ్లు, మొలపురులు.

**కాళ్లసొమ్ములు :-** కడాలు, తొడాలు, పాంజేవులు, గొలుసులు, పట్టగొలుసులు, గజ్జెలు, అందెలు, గుజరాతిపాంజేవులు, యాపకాయగొలుసులు,గుజరాతు పాంజేవులు, కాళ్లపట్టీలు-

**కాలిఏళ్లనగలు :-** పెద్దనేలుమెట్టెలు, మెట్టెలు , సుట్లు, పిల్లాండ్లు, గజ్జెల పిల్లాండ్లు.

**పుస్తెలల్లరకాలు :-** ఆకుపుస్తె, గిన్నెపుస్తె, గజ్జెలపుస్తె, గంటెపుస్తె, పాదాలపుస్తె, కొండ్లపుస్తె, ఇవన్ని వాళ్లవాళ్ల ఇంటివంతన తీర్గవుంటవి. వీటికితోడు పసిపిల్లకు మొల దారాలు, మొలగజ్జెలు, సిగ్గుబిళ్లలు, మురిపానికి ఎన్నెన్నొ.

ఇట్లే మొగోండ్లకు ఉంగురాలు, చెవులకుపోగులు, కొనకె పోగు, దండ పట్టీలు, దండకడాలు, చేతిపట్టి, గుండీలు, గుండీలగొలుసులు, మొల్తాళ్లు, తాయెతలు, మెడల గొల్సు, తావళం, రుద్రాక్షమాల,మెడలో అంబరాసదండలు, కుడికాలుకు బేడివుండేవి.

అమ్మమ్మ ఇప్పుడు నీవు జెప్పిన సొమ్ములల్ల ఒక్కమామిడికాయల దండదప్ప మరో సొమ్మే కండ్లవడ్తలేదు. నగలు లేవంట గాదు, మాదోస్తుల అమ్మలు ఏందో ? సోకు

సోకుల సొమ్ములు వెట్టుకుంటరు గని ఒక్కటి గుడ, మనూరివిగానట్లనిపిస్తది. అన్నిజిగి జగేలంటవిగని నిండుగ కండ్లవడవు. ధరలు మట్టుకు మొగులునుదాకుతవి, అందికె మేం ఆ నగల జోలికి వోక వున్నదాంట్లనె చీరో రయికో గొనుక్కోని కుసివడ్తం అన్నరు.

అప్పుడు నేను అమ్మలూ, నాబంగరుబొమ్మలు సీరలు, రయికెలు, అంటుండరా ? ఎన్కటి సీరలు ఇప్పుడు యాడుండవి బిడ్డ ?నా ఎర్కలి వోయమ్మో ? ఎన్నిరకాలు, మోయ లేనంత బర్వు, బల్లిపార్తోలెగాలికి ఎగిరేటివి, జరి ముద్దలు ఎన్నితీర్లుండేవొ , అట్లె రయికలు పోతలేకుండ తొడ్గుదుమ ? లేదు, ఆకుట్లు, పోతలు గుడ ఎంత నాణెమో, సూడ ముచ్చటే గని సెప్ప తరంగాదు. అనంగనె .

ఆమ్మమ్మ ! ఈత్యాప అప్పటి ఆసీరలు- రయికెల జోలిచెప్పిందాక ఇడ్వం.

ఇంట్లనె నీళ్లగుండాన్ని వెట్టుకోని సెల్మెదోడ్తమంట తిర్గుతుండం, అంట వోనన్ను మొగలు మీది కెత్తినట్ల వొగిడిన్రు. అట్లె జెప్తు రాసుకోండి బిడ్డ అన్న-